మీకు తెలుసా?

**తెలంగాణలో ప్రాజెక్టులపై పెట్టిన ఖర్చు**

| 2004 నుంచి 2014 వరకు (పదేండ్ల కాంగ్రెస్ పాలనలో..) | 2014 నుంచి ఇప్పటి వరకు (బీఆర్ఎస్ హయాం.. తొమ్మిదిన్నరేండ్లలో) |
|---|---|
| రూ.38,000 కోట్లు | రూ.2 లక్షల కోట్లకు పైగా |

**వ్యయం పెరుగుదల 426 శాతం**



*ఆంధ్రప్రదేశ్ అనే గడుసైన పురుషుడితో అమాయకపు ఆడపిల్ల అయిన తెలంగాణను కలిపేటప్పుడు పెద్దలు సెలవిచ్చినట్టుగానే సంసారం సాఫీగా సాగలేదు. కుటుంబ పెద్దలైన పాలకుల ఉద్దేశపూరిత కుట్రల కారణంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైంది తెలంగాణ. ఎంతలా అంటే.. తినడానికే తిండిలేదు, ఆడపిల్లకెందుకు చదువు.. ఇంటి పట్టున ఉంటే పనులు చక్కబెడుతుంది... అని అనుకునేంత!*

*ఆడబిడ్డ గుండెల మీద కుంపటి అనే భావన కుటుంబ పెద్దల్లో సహజంగానే కలిగేలా చేసిన పాపం నాటి పాలకులదే! అంతటి అజ్ఞానంలో బతుకీడ్చిన తెలంగాణ కుటుంబాలు ఇప్పుడు తమకు మొత్తం ఆడ సంతానమే కలిగినా కించిత్ ధైర్యం కోల్పోవడంలేదు. ఆడపిల్లల అభీష్టం ప్రకారం ఎంత పెద్ద చదువైనా వద్దని అడ్డు చెప్పడంలేదు. సరైన ఈడు వచ్చేదాకా పెండ్లి ఊసే ఎత్తడంలేదు. ఇంతటి విప్లవాత్మకమైన మార్పు వెనుక దాగి ఉన్న కృషి సొంత రాష్ట్రంలో కొలువుదీరిన సర్కారుదేనంటే కాదనగలమా? కల్యాణలక్ష్మి రూపంలో అక్షరాలా లక్షానూట పదహార్లు చదివింపులు అందిస్తున్న కేసీఆర్.. తెలంగాణ కొత్త పెండ్లి కూతుర్లకు మేనమామ కాదని ఎవరైనా వాదిస్తే ఔననగలమా?!*



బిగ్ స్టోరీ

# మన పెండ్లిపిల్లకే ..పెద్ద కట్నం

## ఇతర రాష్ట్రాల కన్నా 'కల్యాణలక్ష్మి' మిన్న

### ఆడబిడ్డ పెండ్లి కోసం 13.15 లక్షల కుటుంబాలకు ఆర్థిక సాయం

- వేరే రాష్ట్రాల్లో అంతంత మాత్రమే.. మంజూరుకు సవాలక్ష ఆంక్షలు
- అక్కడ నిధుల కేటాయింపుల్లోనూ కులాల వారీగా హెచ్చుతగ్గులు
- సబ్బండవర్గాలకు సమాన మొత్తం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే
- దివ్యాంగ జంటకు ఆర్థిక సాయంలోనూ మన సర్కారే టాప్

### పథకం అమలుతో బహుముఖ ప్రయోజనాలు

**దేశవ్యాప్తంగా** పలు రాష్ట్రాలు ఆడబిడ్డల కల్యాణం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ తెలంగాణ సర్కారు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో అందిస్తున్న ఆర్థిక సహాయం ఎదుట దిగదిడుపే. ఇదే విషయాన్ని ఓ సామాజిక ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన సంక్షేమ పథకాల్లో అత్యంత కీలకమైనది కల్యాణలక్ష్మి/షాదీముబారక్. 2014 అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ పథకం ప్రభుత్వ ఆశయాన్ని సాకారం చేస్తూ విజయవంతంగా ముందుకు సాగుతున్నది. ఈ పథకం కింద తొలుత ఎస్సీ, ఎస్టీ యువతుల వివాహానికి రూ.51 వేలు అందజేయగా, తర్వాత బీసీలకు సైతం విస్తరింపజేశారు. మూడేండ్ల తర్వాత 2017లో పథకం కింద అందిస్తున్న ఆర్థికసాయాన్ని రూ.51 వేల నుంచి రూ.75,116కు పెంచారు. 2018, మార్చి 19 నుంచి ఆ మొత్తాన్ని మరోసారి రూ.1,00116కు పెంచి దిగ్విజయంగా అమలు చేస్తున్నారు. ఇక దివ్యాంగ ఆడబిడ్డలకు రూ.1,25,145 అందజేస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటివరకు మొత్తం 11.56 వేల కోట్లకు పైగా నిధులను వెచ్చించి 13 లక్షల 15 వేల 297 మంది ఆడబిడ్డలకు మేనమామగా సీఎం కేసీఆర్ ఆర్థిక సహాయాన్ని అందించారు. పేదింటి తల్లిదండ్రుల్లో భరోసా నింపారు.

... మ్యాకం రవికుమార్



#### ● అత్యధిక లబ్ధిదారులు బీసీలే...

**కల్యాణలక్ష్మి** పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో అత్యధికులు బీసీలే. పథకాన్ని ప్రారంభించిన మూడేండ్ల అనంతరం ఈబీసీలకు సైతం వర్తింపజేశారు.. అలా ఇప్పటి వరకు 6,35,451 మందికి మంజూరు చేసింది. మొత్తం 13.15 లక్షల లబ్ధిదారుల్లో బీసీలే 48.31 శాతం కావడం విశేషం. పథకం ద్వారా ఇప్పటి వరకు 13.15 లక్షల మందికి ఆర్థిక సహాయం మంజూరు చేయగా, వధువుతో కలిసి వరుడి కుటుంబాల పరంగా చూస్తే మొత్తంగా 26 లక్షల మంది లబ్ధి పొంది ఉండడం మరో విశేషం.

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో ప్రయోజనం..**

- నిరుపేద తల్లిదండ్రులకు, మరీముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాలకు పెండ్లి ఖర్చు భారం తగ్గిపోయింది.
- 18 ఏండ్ల నిబంధనతో బాల్యవివాహాలు పూర్తిగా తగ్గిపోయాయి.
- అమ్మాయిలకు సరైన వయస్సులో వివాహం చేయడంతో మాతా, శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గింది.
- ఉన్నత విద్యను చదువుతున్న బాలికల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారి అభీష్టం మేరకు వివాహం చేసుకునే, నిర్ణయం తీసుకునే అవకాశం ఏర్పడింది.
- కల్యాణలక్ష్మి చెక్కులను తల్లి పేరు మీద ఇస్తున్న ఫలితంగా మహిళల ఆర్థిక సాధికారత చేకూరుతున్నది.
- వివాహ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయి. అతివలకు చట్టపరమైన భద్రత లభిస్తున్నది.



## సర్వే వివరాలు..

**ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్ష ఏం చేస్తున్నారు?**
బంగారం కొన్నవారు: 27%
పెండ్లికి ఖర్చు పెట్టుకున్నవారు: 57%
అమ్మాయి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినవారు: 16%

**కల్యాణలక్ష్మి పొందిన వధువు విద్యార్హతలు**
గ్రాడ్యుయేషన్ ఆపై చదువులు పూర్తి చేసినవారు : 47.75%
ఇంటర్ వరకు చదివినవారు: 52.25%

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లేకుంటే చదివించేవారా? ముందుగానే పెళ్లి చేసి పంపేవారా?**
కల్యాణలక్ష్మి లేకున్నా చదివించేవాళ్లం: 53%
ముందుగానే పెళ్లి చేసేవాళ్లం: 47%

**భార్య ఇష్టం మేరకు డబ్బులు ఖర్చు పెట్టారా? లేదా భర్త ఇష్టం మేరకు ఖర్చు పెట్టారా?**
భార్య నిర్ణయం మేరకు: 46%
భర్త నిర్ణయం మేరకు: 39.5%
ఇద్దరం నిర్ణయించుకుని: 14.5 %

**పథకంపై లబ్ధిదారుల అభిప్రాయం**
అద్భుతం: 64.25 %
బాగుంది: 35.75%

**కల్యాణలక్ష్మితోపాటు కేసీఆర్ కిట్..**
పొందినవారు: 72.5%
పొందనివారు: 28.5 %


#### ● కల్యాణలక్ష్మి అద్భుతం

**కల్యాణలక్ష్మి/షాదీముబారక్** అమలు తీరుపై పేదింటి తల్లిదండ్రుల అభిప్రాయాలు, పథకం కింద ప్రభుత్వం అందజేస్తున్న రూ.1,00,016 సాయాన్ని లబ్ధిదారులు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు? యువతులకు కలుగుతున్న ప్రయోజనాలపై ఓ సంస్థ ఇటీవల సర్వేను నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 1,000 మంది లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించింది. 90 శాతం మంది ఈ పథకం అద్భుతమని కొనియాడడం విశేషం. ప్రభుత్వ సాయంతో పెండ్లి ఖర్చుల భారం లేకుండా పోయిందని సంతోషం వ్యక్తం చేశారు. లబ్ధిపొందిన వారిలో దాదాపు 72.5 శాతం మంది కేసీఆర్ కిట్టునూ అందుకోవడం మరో విశేషం.



రాష్ట్రంలో కల్యాణలక్ష్మి/షాదీముబారక్ లబ్ధిదారుల వివరాలు

| సంవత్సరం | లబ్ధిదారులు | ఖర్చు (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 13,030 | 66.45 |
| 2015-16 | 75,616 | 385.64 |
| 2016-17 | 96,290 | 440.07 |
| 2017-18 | 1,27,969 | 823.74 |
| 2018-19 | 1,63,902 | 1,403.27 |
| 2019-20 | 1,66,432 | 1,629.06 |
| 2020-21 | 2,10,013 | 2,093.51 |
| 2021-22 | 2,31,372 | 2,314.79 |
| 2022-23 | 1,91,003 | 1,912.02 |
| 2023- (ఆగస్టు నాటికి) | 49,670 | 497.4 |
| మొత్తం | 13,15,297 | 11,565.96 |






## ఆడబిడ్డల పెండ్లి కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న పథకాలు



**తెలంగాణ రాష్ట్రంలో..**
పథకం పేరు: కల్యాణలక్ష్మి/షాదీముబారక్
ఆదాయ పరిమితి: రూ.2 లక్షలు
లబ్ధి పొందే కులాలు: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.1,00,116
దివ్యాంగులకు: రూ.1,25,145

**ఉత్తర్‌ప్రదేశ్‌లో...**
పథకం పేరు: సామూహిక వివాహ పథకం
ఆదాయ పరిమితి: రూ.లక్ష
లబ్ధి పొందే కులాలు: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.51,000 (మొదటి విడత రూ.35 వేలు, రెండో విడత రూ.16 వేలు)
దివ్యాంగులకు: ప్రత్యేకంగా ఏమీ లేదు

**రాజస్థాన్..**
పథకం పేరు: కన్యా షాదీ సహయోగ్ యోజన
ఆదాయ పరిమితి: రూ.60 వేలు
లబ్ధి పొందే కులాలు: దళితులు, బీపీఎల్ కుటుంబాలకే
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.51,000 (3 విధాలుగా, 18 ఏళ్లు నిండిన యువతికి రూ.31 వేలు, ఉన్నత విద్యను పూర్తి చేస్తే రూ.41 వేలు, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతికి రూ.51 వేలు)
దివ్యాంగులు: ప్రత్యేకంగా లేదు


**మధ్యప్రదేశ్‌లో..**
పథకం పేరు: ముఖ్యమంత్రి కన్యా వివాహ్ /నిఖాహ్ యోజన
ఆదాయ పరిమితి: రూ.1.80 లక్షలు
లబ్ధి పొందే కులాలు: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.51,000
దివ్యాంగులకు: ప్రత్యేకంగా ఏమీ లేదు

**గుజరాత్‌లో..**
పథకం పేరు: కున్వరిబాయి నొమెమోరు యోజన
ఆదాయ పరిమితి: రూ.60 వేలు
లబ్ధి పొందే కులాలు: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.12,000
దివ్యాంగులకు: ప్రత్యేకంగా ఏమీ లేదు

**కర్ణాటకలో..**
పథకం పేరు: బిదాయి
ఆదాయ పరిమితి: రూ.1.80 లక్షలు
లబ్ధి పొందే వర్గం: వధూవరులిద్దరూ దళితులై ఉండాలి
అందించే ఆర్థికసాయం: అన్నివర్గాలకు సమానంగా రూ.50,000
దివ్యాంగులకు: ప్రత్యేకంగా ఏమీ లేదు

# వారంటీల వీపు సాపైంది

టీవీలో తెలంగాణ ఎన్నికలపై చర్చ జరుగుతున్నది. రామకోటయ్య ఇంట్రెస్టింగ్‌గా సూస్తున్నడు. పేరు'మాసిన' ఓ విశ్లేషకుడు 'గాలి ఆల్ల వైపే ఈస్తున్నది' అన్నడు. రామకోటయ్య ఎగిరి గంతేసిండు. వెంటనే 'అరేయ్ సత్తి! బండి తీరా పచారానికి పోదాం. ఈసారి గాలి మనవైపే ఈస్తుందంటా' అన్నడు. 'గాలి మనవైపు ఈస్తుందో! మనమే గాల్లో కొట్టుకపోతమో' అని గొణిగిండు సత్తి. 'ఏంట్రా ఏదో గొణుగుతున్నవు' అన్నడు రామకోటయ్య. 'ఏం లేదు అన్న బండి తీస్తున్న' అన్నడు. ఆ మాసిపోయి దుమ్ముపట్టిన పార్టీ కండ్వా అందుకున్నడు రామకోటయ్య. ఇద్దరు కలిసి మందీమార్బలాన్ని వెంటేసుకొని పచారానికి బయల్దేరిర్రు.



**కొంతదూరం** పొయినంక 'బండి ఆపరా సత్తి.. ఈడ నుంచే పచారం షురూ చేద్దం' అన్నడు రామకోటయ్య. 'పోయిపోయి మేఘాల్ని తాకే డబుల్ బెడ్రూం మేడలున్న కేసీఆర్ నగర్‌లో పచారం ఏందన్నా. ఆడ పచారం జేసిన ఓట్లు పడవే' అన్నడు సత్తి. 'చల్ తీ నీ మాట ఇనేదేంది. గిన్నే ఆపు' అని అన్నడు. ఇక జేసేదేం లేక మిషన్ భగీరథ ట్యాంకు పక్కపొంటి బండి ఆపిండు సత్తి. మైకులు, గైకులు ఆన్ జేసి డీజే పాటలు ఎట్టంగనే.. ఏదో సర్కసు అనుకొని జనం జమైర్రు. ఆల్లను జూడంగనే రామకోటయ్యకు ఏడ లేని ఉత్సాహం పొంగుకొచ్చింది. ఇక షురూ జేసిండు. 'గ్యారంటీలు ఇస్తం.. వారంటీలు ఇస్తం. మాకే ఓటెయ్యాలే. కేసీఆర్ ఏం జేసిండు. మన్నూమశానం.. ' నోట్లో మాట నోట్లనే ఉండే. మాకు 'ఆసరా'గా ఉన్న కేసీఆర్‌నే అంటవారా అని ఓ ముసలవ్వ ఊతకర్ర తీస్కొని వీపు విమానం మోత మోగించింది. గీ మధ్యనే 'కల్యాణలక్ష్మి' తీస్కొని లగ్గం జేస్కున్న లచ్చుమమ్మ చెంప ఛెల్లుమనిపించింది. సంకలో పిల్లాన్ని ఎత్తుకొని గప్పుడే అటుదిక్కు అత్తున్న గంగవ్వ 'కేసీఆర్ కిట్'తోని ఒక్కటిచ్చింది. రైతుబంధు పైసలు జేబులేస్కొని అట్నుంచి ఖుషిగొత్తున్న నర్సి దుడ్డు కర్రందుకొని దబదబ బాదిండు. నేనేమైన తక్కువ తిన్ననా అని ఓ బుడ్డోడు 'కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్' తిన్న బలాన్నంతా జమేసుకొని నెత్తిన ఒక్కటిచ్చిండు. వామ్మో.. వాయ్యో అనుకుంట సత్తి, రామకోటయ్య పరుగందుకున్నరు. జనాలు తరిమితరిమి కొట్టిర్రు. పరుగెత్తి.. పరుగెత్తి అల్సిపోయిన రామకోటయ్య, సత్తి ఊరి బయటున్న 'హరితహారం' చెట్ల కింద సాగిలపడ్డరు. కుయ్యో.. మొర్రో అని రామకోటయ్య మూలుగుతుండే. సస్తడేమోనని సత్తి వెంటనే పక్కూరివోయి 'మిషన్ భగీరథ' నీళ్లు తెచ్చి ఇచ్చిండు. కాస్త నిమ్మలమైన రామకోటయ్య 'ఏందిర అట్ల కొట్టిర్రు. సచ్చేటట్టు ఉన్న' అన్నడు. 'కొట్టరా మరి దేవుడసంటోడు కేసీఆర్‌ను అంటే పొట్టుపొట్టు కొడ్తరు. అ యినా ఈ బతుకు బతుకుడెందుకు సావరాదే. రైతు బీమా అయిన అస్తది' అని సత్తి గొణిగిండు. అదిన్న రామకోటయ్య 'ఏందిరా గొణుగుతున్నవు' అన్నడు. 'ఏం లేదు అన్న ఆల్ల కొట్టుడుకు వీపంతా వాపొచ్చింది. ఒళ్లంతా మంట పుడతాంది' అన్నడు. 'అవురా సత్తి నా వీపు గిట్ల సాపైంది' అనుకుంట ఊర చెర్వు వైపు లగెత్తిండు. 'కొంపదీసి నా మాటలు ఇన్నడా ఏంది. సస్తడేమో' అని సత్తి ఆలోచనలో పడ్డడు. 'ఓ అన్నో ఊర చెర్వులో దుంకేవు. 'మిషన్ కాకతీయ'లో మట్టంతా ఎత్తిపోసిర్రు. స్తంభం లోతుంటది. దుంకితే సస్తవు' అనుకుంట సత్తి గిట్ల ఆయనెంటే పరుగెత్తిండు. అంతట్లోనే రామకోటయ్య చెర్వులో దుంకిండు. వామ్మో.. వాయ్యో అనుకుంట సత్తి చెర్వుకాడికివోయిండు. జూస్తే సడీసప్పుడు లేదు. సత్తికి భయమైంది. 'అన్న ఉన్నవా.. పోయినవా. జర చెప్పే. పక్కనే 'వైకుంఠధామం' ఉన్నది కట్టెలు పోగేసుకుంట' అని కేకేసిండు. అంతట్లోనే మూలుక్కుంట రామకోటయ్య పైకి తేలిండు. ఎలచ్చన్లు అద్దు.. ఏమద్దు.. అని ఇద్దరు కల్సి ఇంటిబాట పట్టిర్రు.

... మాలోతు సురేశ్

## వచ్చిపోమ్మను.. ఓసారి చూసిపొమ్మను

ఎవరు చెప్పారు
నా తెలంగాణ చీకటైపోతుందనీ
నా తల్లి బతుకాగమవుతుందనీ
మెడకాయ మీద తలకాయలేని ఆ మనిషెవ్వరు

కోటి కాంతులతో నిత్యం దివిలెగ
వెలిగే వీధుల్ని చూసిపొమ్మను
కొత్త కొలువుతో బతుకు మారిన
కుటుంబాలను కలిసిపొమ్మను
వచ్చిపొమ్మను.. ఓసారి చూసిపొమ్మను

ఆసరా పింఛను అందుకుంటున్న
పండుటాకులను పలుకరించమను
కల్యాణలక్ష్మి సాయమందిన
ఆడబిడ్డలను అడిగిపొమ్మను
వచ్చిపొమ్మను.. ఓసారి చూసిపొమ్మను

కోటి ఎకరాల సెలకను తడిపే
లక్ష్యం గురించి తెల్సుకొమ్మను
పచ్చగ నవ్వేటి పల్లెసీమల్లో
స్వేచ్ఛగ వాళ్లను తిరిగిపొమ్మను
వచ్చిపొమ్మను.. ఓసారి చూసిపొమ్మను

సన్నబువ్వ కడుపారా తినుకుంటా
సదువుకుంటున్న పిల్లలజూడమను
డబుల్ బెడ్‌రూం ఇంట్లో కాపురముంటున్న
పేదల వాకిట్ల కాలు మోపమను
వచ్చిపొమ్మను.. ఓసారి చూసిపొమ్మను

బోనాలు, బతుకమ్మ పండక్కి
ఆహ్వానమిదే ఇక వచ్చిపొమ్మను
రంజాను, క్రిస్మస్ పండుగలో
నిండుదనమిపుడు చూసిపొమ్మను
వచ్చిపొమ్మను.. ఓసారి చూసిపొమ్మను



... ఆన